ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
5
సోమవారం 7 జూలై 2025

విస్తృత తనిఖీలు చేపట్టండి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మద్యం, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ రత్న.. పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా విస్తృత వాహన తనిఖీలు, పట్టణ, గ్రామీణప్రాంతాల్లో డ్రోన్‌కెమెరా నిఘాను పెంచారు. జిల్లాలోని జాతీయ రహదారులు, గ్రామీణప్రాంతాల్లో కొండలు, శివారు ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగించారు. పుట్టపర్తి సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు. బుక్కపట్నం మండలం మదిరేబైలు తండా అటవీప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేసి, 8 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.55,800 నగదు, 5 ద్విచక్రవాహనాలు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై బుక్కపట్నం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. దాడుల్లో పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం ఎస్‌ఐలు లింగన్న, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా తొలి ఏకాదశి



పుట్టపర్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం ఆషాఢ ఏకాదశి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. మరాఠీ భక్తులు సత్యసాయి పల్లకిని మోస్తూ సాయికుల్వంత్‌కు చేరుకున్నారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బాలవికాస్ చిన్నారులు సత్యసాయి ప్రేమతత్వం, పాండురంగ లీలలపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన వారు భక్తిగీతాలు ఆలపించారు. తొలి ఏకాదశి ఉత్సవాల్లో వేలాదిమంది పాల్గొని, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సత్యసాయి పల్లకీ మోస్తున్న భక్తులు, చిన్నారుల నృత్య ప్రదర్శన



పాండురంగ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జయ.. పాండురంగా..

హిందూపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాండురంగ నామస్మరణతో పట్టణం మార్మోగింది. తొలి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో రుక్మిణీ సమేత పాండురంగస్వామి రథయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు వేకువజామునే ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి, రథంపై అధిష్ఠించారు. అనంతరం వేలాదిమంది భక్తుల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పట్టణంలో పేట వెంకటరమణ స్వామిని పాండురంగడిగా అలంకరించి, పూజలు చేశారు.



పాండురంగడి అలంకారంలో పేట వెంకటరమణ స్వామి

జగనన్న లేఅవుట్ ముసుగులో దోపిడీ
రూ.కోట్ల విలువైన స్థలాలు స్వాహా

- జాబితాలో వైసీపీ నాయకుల బినామీలు
- కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు, అపార్టుమెంట్ ఓనర్లు కూడా పేదలే..
- లేఅవుట్ మధ్యలో ఖాళీ స్థలాలు
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- చేతులు మారిన రూ.కోట్లు





లేఅవుట్ మధ్యలో ఖాళీ స్థలం

ఇంటి పట్టా.. అనర్హుల పుట్టా!



పుట్టపర్తి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగనన్న లేఅవుట్ల ముసుగులో వైసీపీ నాయకులు రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలను స్వాహా చేశారు. రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై, రూ.కోట్లు కొల్లగొట్టారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో 2021 సంవత్సరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 121, 143, 144, 145, 146 సర్వే నంబర్లలో 32 ఎకరాల భూమిని సేకరించారు. జగనన్న లేఅవుట్ పేరుతో 1,895 మందికి ఒక్కొక్కరికి సెంటు భూమి చొప్పున పట్టా ఇచ్చారు. పేదల ముసుగులో వైసీపీ నాయకులే అత్యధిక భాగం ఇంటి స్థలాలు పొందారు. అందులోనూ పుట్టపర్తి మున్సిపాలిటీలో లేనివారికి కూడా పట్టాలిచ్చారు. ఇళ్ల స్థలాలు పొందినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, పొగురు మండలాల, పక్క జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు, నియోజకవర్గంలోని కాంట్రాక్టర్లు, బిల్డర్లు, అపార్టుమెంట్ ఓనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారు ఉండడం గమనార్హం.



బ్రాహ్మణపల్లి జగనన్న లేఅవుట్

బినామీల పేరుతో పట్టాలు

పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లిలో జగనన్న లేఅవుట్‌ను కేవలం వైసీపీ నాయకులు, సానుభూతి పరుల కోసమే ఏర్పాటు చేసినట్లు తేటతెల్లమవుతోంది నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై బినామీల పేరుతో పదుల సంఖ్యలో ఇంటిపట్టాలు పొందారు. పుట్టపర్తిలో నివాసంలేని అనేకమంది వైసీపీ నాయకులకు ఈ లేఅవుట్‌లో అప్పనంగా స్థలాలు అప్పగించారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన ఓ మహిళ, వైసీపీ కౌన్సిలర్లు.. బినామీల పేరుతో పాతిక ఇంటిపట్టాలు తీసుకున్నట్లు సమాచారం. ఓ కాంట్రాక్టర్ ఏకంగా 40 ఇంటి పట్టాలను బినామీల పేరుతో స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా బినామీల పేర్లతో ఇళ్ల స్థలాలు తీసుకుని, తరువాత వాటిని ఒక్కొక్కటి రూ.ఐదులక్షల చొప్పున విక్రయించారు. ఈ స్థలాలు ఇప్పటికే అనేకమంది చేతులు మారాయి. జగనన్న లేఅవుట్, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారులు కూడా భారీ మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం. ఈ లేఅవుట్‌లో బినామీలకు ఇంటి స్థలాలిచ్చి, భారీగా (మిగతా 7లో...)

లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమి

బ్రాహ్మణపల్లి జగనన్న లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమిని ఉంచారు. ఈ భూమి చుట్టూ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పేదలకు మాత్రం సెంటు చొప్పున భూమి ఇచ్చిన రెవెన్యూ అధికారులు, ఖాళీగా ఉంచిన ఈ భూమిలో ఒక వైసీపీ నాయకుడికి మూడు నుంచి ఐదుసెంట్ల భూమిని పట్టాలుగా ఇవ్వడం విశేషం. ఉద్దేశపూర్వకంగానే లేఅవుట్ మధ్యలో ఖాళీ భూమిని ఉంచి విలువ వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులు.. వైసీపీ నాయకులకు పట్టాలిచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఐదు సెంట్లలో పునాదులు వేసి అమ్ముకున్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. 10న కొత్తచెరువులో సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి సభాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాలలో అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 10న కొత్తచెరువులో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతున్నారన్నారు. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, మహేశ్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీపీఓ విజయ్‌కుమార్, డీఈఓ కిష్టప్ప, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజు, డీపీఓసమత, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, సమగ్రశిక్ష ఏపీఓ దేవరాజ్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సమస్యలపై అర్జీలు అందించాలని సూచించారు.

బదిలీ చేసేరా..?

- ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు
- సొంత మండలానికి దూరంగా విధులు
- బదిలీల కోసం నిరీక్షణ..
- పట్టించుకోని యంత్రాంగం

(7లో...)



తారు రోడ్డు తళతళ

హామీ నెరవేర్చిన మంత్రి సవిత



నాడు.. కంకర తేలిన మోటువారిపల్లి రోడ్డు

పెనుకొండ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని మోటువారిపల్లికి రోడ్డును పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ ఆలోచన కూడా చేయలేదు. దీంతో జనం ఆగ్రహించారు. కంకర తేలిన రోడ్డులో ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తేవారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రచారానికి గ్రామానికి వచ్చిన వైసీపీ అభ్యర్థి, ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీని ఊరి జనం నిలదీశారు. రోడ్డు వేశాకే గ్రామంలోకి రావాలంటూ తేల్చిచెప్పారు. కూటమి అభ్యర్థిగా సవిత గ్రామానికెళ్లినపుడు గ్రామస్థులు.. రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరారు. రోడ్డు వేయిస్తానని అప్పట్లో సవిత హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చారు. మండలంలోని మోటువారిపల్లి నుంచి గుట్టూరు, అమ్మవారిపల్లి, మునిమడుగు, చిన్నపరెడ్డిపల్లి వరకు రూ.1.85 కోట్లతో రోడ్డు మంజూరు చేయించి, పూర్తి చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



నేడు.. తారురోడ్డు వేసిన దృశ్యం

కేజీబీవీ ఘటనపై జేసీ
విచారణ

7

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు

7

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు అపహరణ

7

వైభవంగా ఖాసీంస్వామి పెద్ద సరిగెత్తు

భక్తులతో కిటకిటలాడిన బత్తలపల్లి

బత్తలపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఖాసీంస్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి, ఉమ్మడి అనంత జిల్లాలో గూగూడు కుళ్లాయిస్వామి తరువాత.. అంతటి స్థాయిలో బత్తలపల్లిలో ఖాసీంస్వామి వేడుకలు జరుగుతాయి. మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం ఖాసీంస్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులు స్వామికి పానకాల దుత్తలు సమర్పించారు. ఈ వేడుకలకు జిల్లా నలమూలల నుంచే కాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు స్వామికి వెండి గొడుగులు, శాలవాలు, పెద్ద పూలహారాలు, చక్కెర, బెల్లం మొక్కుబడులుగా చెల్లించారు. భక్తులతో పీర్లచావిడి కిటకిటలాడింది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అగ్నిగుండంలో పెద్ద మొద్దులు, ఎండుకొబ్బరి వేశారు. గుండం వద్ద యువకులు అల్లావు తొక్కుతూ సందడి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జక్కంపూటి సత్యనారాయణ, తిరుపాలు, పురుషోత్తంచౌదరి, నాగభుషణ, రమేష్‌బాబు, సుబ్బరాయుడు, గంగాధర, ప్రతాప్, నూరి, భూమే నరసింహుడు, గోపాల్, అప్పస్వామి పాల్గొన్నారు. సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు



పూజలు అందుకుటున్న ఖాసీంస్వామి



భక్తులతో కిటకిటలాడుతున్న పీర్ల చావిడి

నేడే భేటీ

మొహర్రం ఉత్సవాలలో భాగంగా చివరిరోజు సోమవారం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఖాసీంస్వామి పెద్ద భేటీ కార్యక్రమం భారీ జనసందోహం మధ్య జరుగుతుంది. ఈ కార్యక్రమానికి గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవంపల్లి, ముష్టూరు, గ్రామాల పీర్లు హాజరవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బదిలీ చేసేరా..?

ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు

సొంత మండలానికి దూరంగా విధులు

బదిలీల కోసం నిరీక్షణ.. పట్టించుకోని యంత్రాంగం

అనంతపురం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలోని ఎంపీఈఓ (మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)ల బదిలీలపై సందిగ్ధత నెలకొంది. రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు పూర్తయినా.. ఎంపీఈఓల బదిలీలపై సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుసేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీల్లో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ప్రాధాన్యమివ్వడం లేదన్న ఆవేదనను బాధిత ఎంపీఈఓలు వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన కొందరు ఎంపీఈఓలు అనంత జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనంత జిల్లాతోపాటు సత్యసాయి జిల్లాలో సొంత మండలానికి దూరంగా ఎంపీఈఓలు పనిచేస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలున్న మహిళా ఎంపీఈఓలు మరింత ఇక్కట్లకు గురవుతున్నారు.

సర్దుబాటుపై నిర్లక్ష్యం

క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాలకు రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓల స్థానాలను కేటాయించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు పూర్తి కావడంతో కొత్త స్థానాల్లో చేరిపోయారు. ఎంపీఈఓలకు బదిలీల ప్రక్రియ చేపట్టకపోవడంతో వారి స్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఆయా ఆర్‌ఎస్‌కే స్థానాలతోపాటు పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మిగిలిన ఎంపీఈఓలను సర్దుబాటు చేయడంపైనా సంబంధిత ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 126 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 180 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 12 కేంద్రాలకు సిరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 133 కేంద్రాలు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు విధులు నిర్వర్తించేలా నిర్ణయించారు. అనంత జిల్లాలో 189 మంది ఎంపీఈఓలు పనిచేస్తుండగా.. 133 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 56 మందిని పంటల విస్తీర్ణం ఎక్కువ కలిగిన ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 420 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 124 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 143 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 73 కేంద్రాలకు సిరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 80 కేంద్రాలకు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను కేటాయించారు. సత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు ఉండగా.. 80 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 54 మందిని పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. ఎంపీఈఓలను సర్దుబాటు చేయడంలో సంబంధిత అధికారులు జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బదిలీల కోసం నిరీక్షణ

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఆప్షన్లు తీసుకొని, వారికి అనుకూలమైన స్థానాలకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది చేసే పనులే చేస్తున్న ఎంపీఈఓలు తమకు అనుకూలమైన స్థానాలకు బదిలీ చేస్తారన్న ఆశతో నిరీక్షిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని ఎంపీఈఓలకు మూడు ఆప్షన్లు తీసుకొని బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తెలిసింది. కడప జిల్లాలో ఎంపీఈఓలు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారన్న సమాచారం సేకరించి, బదిలీలు చేసేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. ఉమ్మడి అనంత జిల్లాలో ఎంపీఈఓల బదిలీల ఊసెత్తకపోవడం గమనార్హం.



రైతు సేవాకేంద్రం

సొంత జిల్లాకు వచ్చినా తీరని సమస్యలు

2015 సంవత్సరంలో టీడీపీ హయాంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరపున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరపున సిబ్బందిని నియమించింది. వ్యవసాయ శాఖలో వీఏఏలు, ఆర్బీకే సిబ్బంది నియామకాలతో అప్పటి దాకా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు గడ్డుకాలం ఏర్పడింది. 2020 సంవత్సరంలో అనంత ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 650 మందిలో 260 మందిని చిత్తూరు జిల్లాకు ఓడీపై బదిలీ చేశారు. ఎంపీఈఓల సంఘం నాయకులు, టీడీపీ ప్రజాప్రతినిధుల చొరవతో ఎంపీఈఓలను ఎట్టకేలకు గత ఏడాది నవంబరు మాసంలో ఉమ్మడి జిల్లాకు రప్పించారు. అప్పట్లో తమను సొంత జిల్లాకు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను కోరినా తర్వాత చూద్దామని పక్కనపెట్టారు. సొంత మండలానికి సుదూరంగా పనిచేయాల్సి వస్తోంది. ఆర్‌ఎస్‌కే సిబ్బంది తరహాలోనే తమకు అనుకూలమైన స్థానాలు కేటాయిస్తారని ఆశలు పెట్టుకున్న ఎంపీఈఓలకు న్యాయం జరుగుతుందో..? లేదో వేచిచూడాల్సిందే.

కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు రాలేదు



రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలను పూర్తి చేశాం. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలను బదిలీ చేయాలని కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు రాలేదు. క్రమబద్ధీకరణలో భాగంగా జిల్లాలో పంట విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని ఆర్‌ఎస్‌కేలలో ఏఏ శాఖల సిబ్బంది పనిచేయాలో ఖరారుచేశాం. కొన్ని ఆర్‌ఎస్‌కేల్లో వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను కేటాయించాం. ఎక్కువ విస్తీర్ణం కలిగిన ప్రాంతాల్లో మిగిలిన ఎంపీఈఓలను సర్దుబాటు చేస్తాం.

-ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

పెద్ద సరిగెత్తులో అపశృతి

- పీర్ల సవారి ఎత్తిన వ్యక్తి గుండెపోటుతో మృతి



ఖయ్యూం (ఫైల్)

గుంతకల్లుటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన పెద్ద సరిగెత్తు కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. పీర్ల సవారి ఎత్తిన ముల్లా ఖయ్యూం (48) గుండె పోటుతో మృతిచెందాడు. ఖయ్యూం వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక తాటాకుల వీధిలో పెద్దచావిడిలో పీర్లు కొలువుదీరాయి. 30 సంవత్సరాలుగా ఖయ్యూం పీర్ల సవారిని ఎత్తుతున్నాడు. ఉదయం లాల్‌స్వామి పీరును ఖయ్యూం ఎత్తి కొద్దిసేపటికి మరొకరికి ఇచ్చాడు. ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పి మకాన్ సమీపంలోని జెండా కట్ట వద్దకు వెళ్లి కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పీర్లను తిలకించేందుకు వచ్చిన భక్తులు షాక్ గురయ్యారు. పీర్ల సవారి ఎత్తిన ఖయ్యూం మృతి చెందడంతో పెద్ద ఎత్తున ప్రజలు జెండాకట్ట వద్దకు చేరుకున్నారు. పీర్లను ఊరేగించకుండా వెనక్కి తీసుకు వచ్చి చావిడిలో కొలువుదీర్చారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఇతర బృందం నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో ఓ మహిళ(40) గంజాయిని ఇతరులకు విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. నిందితురాలి నుంచి 435 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆమెను రిమాండ్‌కు పంపుతున్నట్టు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుత్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు ఆదివారం జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడి ఎడమ చేతిపై స్వప్న అని టాటూ మార్క్ ఉందని వివరించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు అపహరణ

చిలమత్తూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పొలంలో పశుగ్రాసం కోస్తున్న మహిళ కళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు కారం కొట్టి బంగారు గొలుసు అపహరించుకు వెళ్లిన ఘటన మండలంలోని మొరసలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. మొరసలపల్లికి చెందిన శాంతమ్మ గ్రామ సమీపంలోని తన పొలంలో పశువుల మేత కోసం వెళ్లింది. అక్కడ పశుగ్రాసం కోస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కళ్లల్లో కారం కొట్టి మెడలో ఉన్న మూడు తులాల బంగారు మాంగళ్యం గొలుసుని లాక్కెళ్లారు. కళ్లల్లో పడిన కారం మంటతో ఆమె గట్టిగా అరుచుకుంటూ ఊళ్లోకి వచ్చి జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది. కళ్ల మంటతో బాధపడుతున్న ఆమెను 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు చూపుతున్న పోలీసులు

మడకశిర టౌన్/రూరల్, జూలై6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మణూరు గ్రామంలో గతనెల 28న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముత్తక్క అనే వృద్ధురాలి హత్య కేసులో వారం రోజుల్లోనే నిందితులను అరెస్టు చేశామని వివరించారు. ముత్తక్కను జూన్ 28వ తేదీ రాత్రి మణూరు గ్రామంలో ఇంట్లో నిద్రపోతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన మాళమ్మగారి చౌడప్ప, బిహార్ రాష్ట్రానికి చెందిన.. మణూరులో నివాసం ఉన్న ఊర్మిళాదేవి ఇద్దరు కలిసి హత్య చేసినట్లు తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన జితేంద్రపాశ్వాన్ మణూరుకు వచ్చి సమీపంలోని ఒక కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడని వివరించారు. అతడి భార్య ఊర్మిళాదేవితో చౌడప్ప వివాహేతర సంబంధం పెట్టుకొన్నాడని తెలిపారు. ముత్తక్క ఒంటరిగా ఉండడంతో ఆమె వద్ద ఉన్న బంగారం, నగదు తీసుకోవాలని పన్నాగం పన్నారని అన్నారు. ఆమె రాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో మంచం పైనుంచి కిందకు లాగి ఊర్మిళాదేవి ముత్తక్క కాలు గట్టిగా పట్టుకోగా.. చౌడప్ప ముత్తక్క నోటిపై తల దిండుతో బలంగా పట్టుకొని అక్కడ ఉన్న ఇనుప రాడుతో గొంతుపై పెట్టి గట్టిగా నొక్కి చంపినట్లు వివరించారు. ముత్తక్క వద్ద ఉన్న బంగారు చైన్, కాలి వెండి పట్టీలు, బీరువాలోని రూ.25వేల నగదును ఎత్తుకు వెళ్లినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇంటి పట్టా.. అనర్హుల పుట్ట!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు వసూలు చేసిన ఓ రెవెన్యూ అధికారి బెంగుళూరులో రూ.కోట్లు ఖర్చుపెట్టి ఓ భారీ భవంతిని నిర్మించుకున్నట్లు తెలిసింది.

సీఎంకు ఫిర్యాదు చేసే యోచన

వైసీపీ హయాంలో బ్రాహ్మణపల్లి లేఅవుట్ అక్రమాలపై రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ లేఅవుట్ అక్రమాలపై కొంతమంది గ్రామస్థులు, టీడీపీ నాయకులు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీపీఆర్సీ సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి కూడా లేఅవుట్‌లో అక్రమ పట్టాల విషయంపై విచారించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి మూడుమార్లు లేఅవుట్‌ను పరిశీలించి, ఖాళీ భూమిలో మాత్రమే 151 మంది అక్రమ పట్టాలు పొందినట్లు గుర్తించారు. నివేదికలు తయారుచేసి ఆరు నెలలు పూర్తయినా అక్రమార్కులపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడానికి అధికారులు జంకుతున్నారు. ఈ అక్రమ పట్టాల విషయంలో అధికార పార్టీకి చెందిన ఓ రాజకీయ దళారీ, మధ్యవర్తిగా వ్యవహరించి, అక్రమార్కులను కాపాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. 1,895 మంది పట్టాలు పొందిన వారిలో సగానికి పైగా అనర్హులు ఉండగా.. వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోకుండా కేవలం ఖాళీ భూమిలో పట్టాలు పొందిన కొంతమందిపై చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 10న పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తుండడంతో ఆయనను కలిసి, అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి కూటమి నాయకులు సిద్ధమయ్యారు.


50 పట్టాలు రద్దు చేశాం: సువర్ణ, ఆర్టీవో, పుట్టపర్తి

పుట్టపర్తి మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి జగనన్న లేఅవుట్‌లో బోగస్ పట్టాలపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టాం. లేఅవుట్ మధ్యలోని ఖాళీ భూమిలో పట్టాలు పొందిన 50 మందిని అనర్హులుగా గుర్తించి, పట్టాలు రద్దుచేశాం. మరికొన్నింటిపై విచారిస్తున్నాం.

సీమ వచన శతక తొలికవి షరీఫ్

- 'చెట్టు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

అనంతపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఆధునిక సాహిత్యంలో వచన శతకం రాసిన తొలికవి డాక్టర్ జూటూరు షరీఫ్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన రచించిన వచన శతకం 'చెట్టు' పుస్తకావిష్కరణ సభను అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. అరసం జిల్లా గౌరవాధ్యక్షుడు ఉప్పరపాటి వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు రచయిత డాక్టర్ శాంతినారాయణ, అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ... వచన శతకం రాసినవారిలో జూటూరు షరీఫ్ రాయలసీమలో మొదటివాడని పేర్కొన్నారు. పర్యావరణ విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కావ్యమని, దీని ద్వారా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని నింపారని పేర్కొన్నారు. చెట్టును కేంద్రంగా చేసుకుని ప్రభావశీలంగా, కవితాత్మకంగా వచన శతకం రాయడం అభినందనీయం అన్నారు. అనంతరం సాహితీవేత్తలు షరీఫ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యులు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ అంకె శ్రీనివాస్, మురళీకృష్ణ భరద్వాజ్, రాయుడు, శ్రీనివాసరెడ్డి, శ్యామసుందరశాస్త్రి, సూర్యనారాయణ రెడ్డి, తన్నీరు నాగేంద్ర, రాంకుమార్, గోవిందరాజులు, కొత్తపల్లి సురేష్, జెన్నె ఆనందకుమార్, కృష్ణమూర్తి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, చెట్ల ఈరన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

వాహన దొంగలు వైసీపీ మద్దతుదారులే..

జావిద్‌ఖాద్రీ, తైక్వాండో బాబాను విచారించాలి

తాడిపత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ షెక్షావలి డిమాండ్

తాడిపత్రి, జూలై6(ఆంధ్రజ్యోతి): వాహన చోరీలు చేసింది వైసీపీ మద్దతుదారులే అని మున్సిపల్ వైస్‌చైర్మన్ షెక్షావలి ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండురోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ.. వాహనాలను అపహరిస్తున్నది మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులేనని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెద్దారెడ్డి అనుచరులు గయాజ్, ముస్తాక్‌ఖాదీ, రోషన్ చోరీలకు పాల్పడ్డారన్నారు. వీరంతా వైసీపీ పట్టణ అధ్యక్షుడు జావీద్‌ఖాద్రీ సమీప బంధువులే అన్నారు. ఈ విషయాలను కప్పిపుచ్చుతూ పెద్దారెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వీరంతా పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులే అనీ, ఆయనకు ఏమైనా వాటాలు ఇచ్చారా అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే తైక్వాండో బాబా దగ్గర రెండు స్కూటీలున్నాయనీ, వాటిని ఎందుకు రికవరీ చేయలేదన్నారు. పదేపదే ముస్లిం యువకుల గురించి మాట్లాడుతూ వారిని దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరోసారి ముస్లిం యువకుల గురించి మాట్లాడితే నాలుక కోస్తామని పెద్దారెడ్డిని హెచ్చరించారు. ముఖ్యమైన జావిద్‌ఖాద్రీ తైక్వాండో బాబాను విచారించకపోతే ఈనెల 9న డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్‌బాషా, ఖాదర్, టాటా హాజీ, ఫరూక్, నజీర్, హాజీ, గాంధీ, అయూబ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్

భార్య, పిల్లలు కనిపించట్లేదని ఫిర్యాదు



ఎర్రమ్మ, పిల్లలు (ఫైల్)

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఎర్రమ్మ, కుమారుడు నందకిశోర్, కుమార్తె వసంతిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త రామకృష్ణ ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఎర్రమ్మ భర్తతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ తెలిసిన వారు 6305800429, 9849665132, 9391560956 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

గూగూడు బ్రహ్మోత్సవాలకు 65 బస్సులు : ఆర్‌ఎం

అనంతపురం టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అనంతపురంతోపాటు తాడిపత్రి, ధర్మవరం డిపోల నుంచి నార్పల మీదుగా గూగూడుకు 65 బస్సులు నడిపినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం గూగూడులో ప్రత్యేక బస్సు కౌంటర్‌ను సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. సోమవారం కూడా అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాల సందర్భంగా 75 బస్సులను నడుపుతామని వివరించారు.

కేజీబీవీ ఘటనపై జేసీ విచారణ

బాధ్యులపై చర్యలు చేపట్టండి: సీపీఎం



జేసీకి సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఉన్న కేజీబీవీని ఆదివారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సందర్శించారు. మూడు రోజుల క్రితం విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన విదితమే. ఈ నేపథ్యంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ ఆనంద్ కుమార్‌తో కలిసి కేజీబీవీని సందర్శించారు. సంఘటన పూర్వాపరాలపై విచారణ చేపట్టారు. హాస్టల్ గదులు, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. స్థానిక సిబ్బంది, విద్యార్థినులను విచారించారు. అనంతరం అక్కడికి చేరుకున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు జేసీని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కేజీబీవీలో టీచింగ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మధ్య సమన్వయం లోపించడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తాగునీరు, ఆహారంలో నాణ్యత లోపించడంవల్ల గత మూడేళ్లుగా ఇలాంటి సంఘటనలు అనేకమార్లు చోటుచేసుకున్నాయన్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైతే తల్లిదండ్రులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వివరించారు. గుట్టుచప్పుడు కాకుండా చికిత్సలు ఎందుకు చేయిస్తున్నారో తెలియడం లేదన్నారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన జేసీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కొండావెంకటేశులు, నాగభూషణ, రవి, మాబు, రామక్రిష్ణ, గోవిందప్ప, జింకా నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు

మూడోరౌండ్ మల్టీడే క్రికెట్ పోటీలు ప్రారంభం



అభిషేక్‌రెడ్డి



పృథ్వీరాజ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో భారీ స్కోరుపై చిత్తూరు జట్టు కన్నేసింది. సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ మూడో రౌండ్ పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో ప్రారంభమయ్యాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 81 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 316 పరుగులు చేసింది. బ్యాటర్లు అభిషేక్ రెడ్డి (160), పృథ్వీరాజ్ (125 నాటౌట్) సెంచరీలతో చెలరేగారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 65.5ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. నారాయణ (52), సుబ్రహ్మణ్య (51) హాఫ్ సెంచరీలతో అలరించారు. కడప బౌలర్లు పఠాన్ షరీఫ్ 5, అరీఫ్ బాషా 3వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప 12.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 47 పరుగులు చేసింది.

కడప జట్టుపై అనంత గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కడప జట్టుపై జిల్లా అండర్-19 పురుషుల జట్టు విజయం సాధించింది. కడపలో నిర్వహిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌అండర్-19 సౌత్‌జోన్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు 59.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 92.2 ఓవర్లలో 8 వికెట్లకు 486 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంత బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి డబుల్ సెంచరీతో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 51.1 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. దీంతో అనంత జట్టు ఇన్నింగ్స్, 59 పరుగుల తేడాతో భారీ విజయం సొంతం చేసుకుంది. వరుణ్‌సాయి నాయుడు ఐదు వికెట్లు పడగొట్టాడు.

పశువుల సంత ఆదాయం రూ.2.87 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.2,87,530 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,77,830, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,09,700 వచ్చిందని తెలిపారు.

జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా బేస్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈనెల 12వతేదీ నుంచి కదిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబుళేసు, ప్రధాన కార్యదర్శి నవీన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సంతోష్‌నాయక్, లెక్చరర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అక్కదేవతల జలధి


అలంకరణలో అక్కదేవతలు

ధర్మవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్ట కిందపల్లిలో ఆదివారం అక్కదేవతల జలధి కార్యక్రమాన్ని పూజారులు మహేశ్, బయన్న ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్క దేవతల ప్రతిమలను గుట్టకింద పల్లి సమీపంలోని వంకలోకి తీసుకెళ్లి జలధి నిర్వహించారు. అనంతరం అక్కడ పుణ్యాహవాచనం, అక్కదేవతలకు పంచామృతాభిషేకం, శ్రీసూక్త పారాయణం చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

'లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం'


ఎంపికైన లయన్స్‌క్లబ్ పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కోశాధికారి

ధర్మవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ గోపా నరసింహులు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవ పురం లోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ గోపా నరసింహులు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా ఆకులేటి రమేశ్‌బాబు, కార్యదర్శిగా ఉలవల నాగేంద్ర, కోశాధికారిగా కొత్తపాలెం వెంకటేశ్‌కుమార్ ఎంపిక చేశారు. వారు ప్రమాణ స్వీకారంచేశారు. వారు మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి పరీక్షలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించి లయన్స్ క్లబ్ అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు వెంకటస్వామి, ప్రతినిధులు వేణుగోపాలచార్యులు, పల్లెంవేణుగోపాల్, రాజీవ్‌నేత, గూడూరు మోహన్‌దాస్, గోసే రాధాకృష్ణ, ఉట్టి శివప్రసాద్, సాగా సురేశ్, చందా నాగరాజు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి ధర్మవరానికి చెందిన రైస్‌మిల్ యజమాని గంగిరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్‌కు అందజేశారు. ఆలయంలో అన్న ప్రసాదశాల కోసం గంగిరెడ్డి విరాళాన్ని అందజేసినట్టు ఆలయ చైర్మన్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 57 కేసుల పరిష్కారం : సీఐ

ముదిగుబ్బ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో 12 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 57 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు ముదిగుబ్బ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శివరాముడు పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మొత్తం 57 కేసులకు శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగిందన్నారు. వాటిలో ఎక్సైజ్ శాఖ 27 కేసులు, పిటీ కేసులు 30 పరిష్కారం అయినట్లు వివరించారు. వీటి పరిష్కారానికి సహకరించిన ముదిగుబ్బ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కదిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని దాంపల్లికి చెందిన రమణ(57)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహులు ఆదివారం తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ శనివారం రాత్రి విషపు గుళికలు మింగాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో కదిరి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. అతడు అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడి భార్య గంగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కదిరి అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సహంగా సాగాయి. కోచింగ్ క్యాంపు ఎ, బి జట్ల మధ్య పోటీలు జరిగాయి. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన క్యాంపు -ఏ జట్టు 35 ఓవర్లల్లో 5 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. వీరిలో తరుణ్ 35, రామ్‌ప్రణయ్ 42, ప్రశాంత్ 66 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బి - జట్టు 145 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విజయం సాధించిన ఏ - జట్టును కోచ్ నజీర్ అభినందించారు.

'ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయండి'

అమడగూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని చినగానిపల్లిలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హరిబాబు, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

ధర్మవరం/కొత్తచెరువు/కదిరి అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేశ్ అన్నారు. ఏకలవ్య జయంతిని ఆదివారం స్థానిక కేతిరెడ్డి కాలనీలో ఘనంగా జరుపుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జేఏసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు సాకే అశోక్, ఎరుకల పోరాట సమితి జిల్లా నాయకులు గుజ్జల రాఘవ, గుజ్జల బాలు, మధు, రమేశ్, గోపాల, కుమార్, వేణు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని గణేశ్ సర్కిల్‌లో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఎరుకుల సేవాసంఘం రాయలసీమ సెక్రటరీ దేవరకొండ గంగాదర్, జిల్లా ప్రదానకార్యదర్శి సంపత్, ఈసీ మెంబర్లు దేవరకొండ రాము,రమేశ్ పాల్గొన్నారు. కదిరి పట్టణంలోని అర్ అండ్ బీ బంగ్లాలో ఎరుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాసులు, చలపతి, నాగభూషణం, రాజగోపాల్, రామాంజనే యులు, నారాయణస్వామి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో ఏకలవ్యుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


అలంకరణలో పోతుకుంట లక్ష్మీనరసింహస్వామి


పంజుశ్యావాతో ఊరేగింపుగా వెలుతున్న భక్తులు


బుక్కపట్నంలో ఎలవగంపలను ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ధర్మవరం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పోతుకుంట గ్రామం ఎస్సీకాలనీలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. మూలవిరాట్‌ను అందంగా అలంకరించారు. భక్తులు గ్రామ సమీపంలో ఉన్న స్వామివారి కొండవద్దకు వెళ్లి పాలుపోసి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పూజారి పంజుశ్యావాతో ఊరేగింపుగా వచ్చారు. ఈ ఘట్టాన్ని భక్తులు తిలకిస్తూ పెద్దఎత్తున లక్ష్మీనరసింహస్వామి గోవింద నామస్మరణ చేశారు. అనంతరం భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఆలయంలో దాసంగాలు ఏర్పాటు చేశారు.

● పుట్టపర్తి రూరల్: మండలపరిధిలోని జగరాజుపల్లి సమీపంలో కొండపై వెలసిన ఓబులేశుస్వామి దేవస్థానంలో ఆదివారం ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సోమవారం రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో తొలిరోజున ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, దయ్యాల ఉమాపతి, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, గూడూరు శంకర్, జయరామిరెడ్డి, చెన్నయ్య, అనంద్, ఓబుల్‌రెడ్డి, శంకరప్ప భక్తులకు ఏర్పాట్లు చేపట్టారు.

● బత్తలపల్లి : మండలవ్యాప్తంగా ఆదివారం తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి, కొబ్బరి కాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బుక్కపట్నం: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుక్కపట్నంలో ఎలవగంపను ఊరేగించి, స్థానిక చెరువులోని అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిన్ననాగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రైతులు ఎద్దుల బండ్లను గ్రామంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మారని రోడ్ల తీరు

● జిల్లా కేంద్రంలో అధ్వానంగా...
● సత్యసాయి జయంత్యుత్సవాలకైనా మెరుగు పరచాలంటున్న పట్టణవాసులు


గుంతలమయంగా వెస్టు గేట్ రోడ్డు

పుట్టపర్తి రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): 'ఆశోకుడు రోడ్లు వేయించెను. రోడ్లకు ఇరువైపుల చెట్లను నాటించెను.' అని ఇప్పటికీ చరిత్ర పుస్తకాలు చదివితే మనకు తెలుస్తుంది. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మొట్టమొదట రోడ్లను మెరుగుపర్చాలి. రహదారులు నాగరికతకు చిహ్నాలని, రోడ్లు బాగుంటే దేశం, రాష్ట్రం, ప్రతి ఊరు ప్రగతి పథంలో పాలకులు పదే పదే వల్లె వేస్తుంటారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా ప్రథమ ప్రాధాన్యంగా రోడ్లను అభివృద్ధి చేస్తోంది. అయితే జిల్లా కేంద్రంలోని కొన్ని రోడ్ల పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. చాలా అధ్వానంగా తయారయ్యాయి. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో జిల్లా కేంద్రంలోని రోడ్లను ఏమాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చినాక అయినా రోడ్ల పరిస్థితి మెరుగుపడుతుందన్న ఆశ ప్రజల్లో బలంగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా వాటి స్థితిలో మార్పు రాకపోవడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పుట్టపర్తి అభివృద్ధిని కాంక్షిస్తూ నిర్మించిన అవుటర్ రింగ్ రోడ్డు (బీటీ రోడ్డు) కాస్తా మట్టి రోడ్డుగా మారిపోయింది, అలాగే ఫోర్ లేన్ రోడ్డు నుంచి ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ వద్దకు చేరుకోవడానికి నిర్మించిన రోడ్డు గుంతలమయం అయింది. వెస్ట్ గేట్ రోడ్డు నుంచి పెద్దకమ్మవారిపల్లి వెళ్లే రోడ్డు (బీటీ రోడ్డు) కంకర తేలి ప్రయాణికుల కళ్లలో నీళ్లు తెప్పిస్తోంది. సత్యసాయి హాస్పిటల్ నుంచి బీడుపల్లి వెళ్లే రోడ్డు కంకర తేలింది. అయినా పుట్టపర్తి జిల్లా కేంద్రంగా ఏర్పడి సంవత్సరం దాటి పోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి సంత్సరం దాటిం ది. అయినా అధికార పార్టీ నాయకులు రోడ్ల మరమ్మతులు పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఫోర్‌లేన్ రోడ్డుకు, వెస్ట్‌గేట్ రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలు తరలిస్తున్నారు. అక్కడే వాటిని తగలబెడుతున్నారు. అలాగే వ్యర్థాలు తోలి రెడ్డికుంటను క్రమంగా పూడ్చేస్తున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. ప్రస్తుతం సత్యసాయి బాబా జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. అలాగే ఆ పండుగకు మరో 140రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో ఇప్పటినుంచి పరిశుభ్రతకు పనులు మొదలుపెడితే బాగుంటుందని పట్టణవాసులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన వదిలిన వ్యర్థాలు

బకాయిలను వెంటనే చెల్లించాలి: యూటీఎఫ్

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుచేయాలన్నారు. ఒకవేళ కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. మెమో 57 ప్రకారం సెప్టెంబరు 2024కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఆంజనేయులు, రామాంజినేయులు, సాయిగణేశ్, వెంకటకిశోర్, యూటీఎఫ్ రిటైర్డ్ పెన్షనర్స్ నాయకులు హనుమంతరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): తనపై దాడి చేశారని పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన కొడిగి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కొడిగి రామాంజినేయులు పెద్దకుమారుడు రవి, కోడలు లక్ష్మీతేజ మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో లక్ష్మీతేజ మామలు నాగభూషణం, మునిస్వామి వచ్చి కొడిగి రామాంజినేయులపై దాడి చేశారు. ఈ మేరకు రామాంజినేయులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుతో నాగభూషణం, మునుస్వామిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ , బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిం చారు. 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 48 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరాం తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి వంకదారి మోహన్, క్యాంప్ చైర్మన్ చాంద్‌బాషా, పీఆర్ఓ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత తహసీల్దార్‌కు సన్మానం


దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓ, తదితరులు

శెట్టూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనతో పాటు ఆయన భార్య భాగ్యలక్ష్మిని స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, విశ్రాంత డీఎస్ఓ శివశంకర్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధికారి దివాకర్, కంబదూరు తహసీల్దారు బాలకిషన్, పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ నాయకులు


25వ వార్డులో కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని టీడీపీ 25వ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంల భాగంగా ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం వార్డులో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీమల రామాంజి, క్లస్టర్ రామాంజి, బూత్ కన్వీనర్‌లు, సెక్షన్ ఇన్‌చార్జ్‌లు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని, ఏడాదిలోనే ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని టీ డీపీ మండల నాయకులు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినే యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని క్లస్టర్ ఏడు పరిధి లోని ధర్మపురి, రావులచెరువు, యర్రగుంటపల్లి, వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి, దర్శినమల, ఓబుళనాయునిపల్లి, మల్లాకాల్వ గ్రామాల్లో బూత్‌కన్వీనర్లు, నా యకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కోక్లస్టర్ ఇన్‌చార్జ్ రమేష్‌నాయుడు, జంగం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారు ఆదివారం సుపరి పాలనకు తొలి అడుగులో భాగంగా మండల పరిధిలోని కొండగట్టుపల్లి, మద్దన్నగారిపల్లి, చెంచుగారిపల్లి, తప్పిటవారిపల్లిల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, కోట్ల బాబి, చినగాని నరసింహ యాదవ్, సూర్యశేఖర్ రాజు, మహబూబ్ పీరా, కనుమ చంద్ర, సాంబశివ శివ నాయక్, సునీల్, చంద్రబాబు, హేమలతా బాయి, రామచంద్ర, భైరవ, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రూరల్ నాయకులు


పథకాలపై వివరిస్తున్న ముదిగుబ్బ నాయకులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

● బైరాని గుట్ట వద్ద ఐదు గ్రామాల పీర్ల భేటీ


బైరాని గుట్టవద్ద భేటీ అయిన ఐదు గ్రామాల పీర్లు

తనకల్లు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా మండలకేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలోని బైరాని గుట్ట వద్ద ఉన్న పురాతన శివాలయం ప్రాంతంలో ప్రతి యేటా మండ లంలోని ఐదు గ్రామాల పీర్లు భేటీ అవుతాయి. ఆ ఆనవాయితీ ప్రకారం ఆదివారం ఉదయం 7గంటలకే మండలంలోని తనకల్లు, ఉస్తిలిపల్లి, కోటూరు, దుగినేపల్లి, చింతమర గ్రామాలకు చెందిన పీర్లు భేటీ అయ్యాయి. ముజావర్లు చక్కెర చదివింపులు చేసి, పీర్లను తిరిగి ఆయా గ్రామాలకు పంపారు. ఈ పీర్ల కలయికను చూసేందుకు పరాకుంవాండ్లపల్లి, మండ్లిపల్లి, గోళ్లవారిపల్లి, రెడ్డివారిపల్లి, కొక్కంటి క్రాస్, గోవిందువారిపల్లి, వంకపల్లి గ్రామాల నుంచే కాకుండా పక్క మండలాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


తాడిమర్రిలో కొలువుదీరిన పీర్లు

● తాడిమర్రి: మొహర్రం సందర్భంగా ఆదివారం తాడిమర్రిలో పెద్దసరిగెత్తు నిర్వహించారు. ముజావర్లు పీర్లకు చక్కెర చదివింపులు చేసి, పానకాలు సమర్పించారు. కురుబలు అటుకల్లప్ప పీరుకు చదివింపులు చేసుకున్నారు. సాయంత్రం అగ్ని గుండం వెలిగించారు. సోమవారం జలధి నిర్వహిస్తారు.


మల్కాపురంలో పీర్ల ఊరేగింపు

● ధర్మవరం రూరల్: మండలపరిధిలోని మల్కాపురం గ్రామంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికి పీర్లను ఊరేగించారు. గ్రామస్తులు పెద్దఎత్తున చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం పెద్దసరిగెత్తు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.


గాండ్లపెంటలో కొలువుదీరిన పీర్లు

● గాండ్లపెంట: మండలపరిధిలో గాండ్లపెంట, తూపల్లి, కటకంవారిపల్లి, కటారుపల్లి, కమతంపల్లి, తుమ్మలబైలు, గొడ్డివెలగల, జీన్లకుంట తదితర గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చారు. ఆదివారం రాత్రి అగ్నిగుండం వెలిగించారు. సోమవారం పీర్లను జలధికి వెళతాయి. పీర్లు సలాంలు అందుకునే కార్యక్రమం జరుగుతుంది. గాండ్లపెంటలో జరిగే ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు కదిరి పట్టణ భక్తులు తరలివస్తారు.


గోపేపల్లిలో కొలువుదీరిన పీర్లు

● నల్లమాడ: మండలపరిధిలోని గోపేపల్లి, పుల్లగూర్లపల్లిలో మొహర్రం చావిళ్లలో కొలువుదీరిన పీర్లకు ఆదివారం ఆయా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జలధి నిర్వహించారు. శనివారం అగ్నిగుం డం ఏర్పాటు చేసి అల్లావుతొక్కారు. అనంతరం జలధికి తీసుకె ళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మొహర్రం సందర్భంగా మండల పరిధిలోని కొండకమర్ల గ్రామంలో కొలువుదీరిన పీర్లకు సోమవారం జలధి నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు అబ్దుల్లాహుస్సేన్, హనీఫ్, ఖాజీపీర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హామీలు నెరవేర్చేదాకా పోరాడుదాం

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా పోరాటం చేద్దామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి వైసీపీ శ్రేణులకు పిలుపినిచ్చారు. జిల్లా కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి యేడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు ఏవీ అమలు కావడంలేదని విమర్శించారు. ఆధ్యాత్మిక కేంద్రంలో పేకాట యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. మాజీఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీదర్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి వేరుశనగకు గిట్టుబాటు ధరల్లేక రైతులు విలవిలలాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, కన్వీనర్లు రవినాయక్, అవుటాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాండ్లపెంటకు ఎంపీ, ఎమ్మెల్యే రాక

గాండ్లపెంట, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం చేపడుతున్న సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమానికి ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

చిగిచెర్లకు పరిటాల శ్రీరామ్

● ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల ప్రధానకార్యదర్శి విజయసారథి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

నల్లచెరువు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గీతా మందిరంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10గంటలకు కార్యకర్తల నిర్వహించనున్నట్లు కన్వీనర్ రాజశేఖర్‌బాబు, గుప్తప్రసాద్ తెలిపారు. అన్ని పంచాయతీల్లోని గ్రామ కమిటీలతో గ్రామ సమస్యలపై చర్చిస్తామన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ధర్మవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జరుపుకున్నారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేశ్, దళిత నాయకులు కేశగాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సుపరిపాలనకు తొలిఅడుగులో టీడీపీ నాయకులు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ అన్నారు. ఆదివారం పెనుకొండ నగర పంచాయతీ 20వ వార్డు మంగాపురంలో ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు తొలి అడుగు నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి నారాయణనాయక్, బూత్‌ఇన్‌చార్జి ఈశ్వరయ్య, నారాయణ, నాయకులు వేణుగోపాల్, సోషల్ మీడియా కన్వీనర్ మనోహర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రొద్దం(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ నాయకుడు మాధవనాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని మోపర్లపల్లిలో సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. యేడాది కాలంలోనే తల్లికి వందనం ఉచిత గ్యాస్ సిలెండర్లు, సీసీరోడ్లు, తదితర వాటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో నరహరి, చిన్నప్పయ్య, చంద్రమౌళి, టైలర్ ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రంగన్న, లింగప్ప, సిద్దన్న, ఆది, శంకర, తదితరులు పాల్గొన్నారు.



మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యం అని మండల కన్వీనర్ నాగరాజు అన్నారు. ఆదివారం మణూరు, వైబి హళ్ళి, గౌడనహళ్ళి పంచాయతీ కేంద్రాల్లో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైబి హళ్ళి సర్పంచు రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి మారుతిరెడ్డి, క్లష్టర్ కన్వీనర్ మురళిబాబు పాల్గొన్నారు.



రొళ్ల, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. కార్యక్రమంలో కుంటిగ వక్కళిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, మండల అధ్యక్షుడు ఈరన్న తాలూకా కోఆర్డినేటర్ రామక్రిష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ దాసిరెడ్డి, తిమ్మప్ప, మారుతిప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు.



సోమందేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ నగర్‌లో ఆదివారం తొలిఅడుగు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పథకాలను నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ప్రతిపథకం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశులు, పట్టణ కన్వీనర్ సూరీ, సూర్యనారాయణ, కిష్టప్ప, మద్దిలేటి, అంజి తదితరులు పాల్గొన్నారు.



అగళి, జూలై6(ఆంధ్రజ్యోతి): మండలం ఇరిగేపల్లిలో ఆదివారం సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, కన్వీనర్ కుమారస్వామి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

నేడు కెంకెర, పి. బ్యాడిగెర గ్రామాల్లో..

మండలంలోని కెంకెర, పీ బ్యాడిగెర, హెచ్‌డిహళ్లి, గ్రామ పంచాయతీల లోని గ్రామాల్లో సోమవారం సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని నాయకులు, కార్యకర్తలు, విజయవంతం చేయాలని కోరారు.



గోరంట్లలోని చౌడేశ్వరీకాలనీలో మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, మాజీ కన్వీనర్ సోముశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సుపరిపాలన తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించారు.

ఘనంగా గ్రామీణాభివృద్ధి దినోత్సవం

అమరాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక సచివాలయంలో గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈఓఆర్డీ సుధాకర్, ఏపీఓ శివన్న, పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి జరిగితేనే దేశం అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో డబ్బు ఖర్చు పెడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలుపరిచే దిశలో అందరూ కృషిచేయాలని వారు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలనే దిక్కు..!

ప్రతిశాఖలో ఇదే తంతు.. పరిష్కారం కాని సమస్యలు

ఇబ్బందుల్లో లబ్ధిదారులు



ఎంపీడీఓ కార్యాలయం

అగళి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిశాఖలో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. రెగ్యులర్ అధికారులు లేరు. దీంతో లబ్ధిదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంలేదు. దీంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చాలా వరకు కార్యాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల్లో ఇన్‌చార్జిలను నియమిస్తున్నారే తప్ప రెగ్యులర్ ఉద్యోగులను అలాట్ చేయడం లేదని ఆ ప్రాంతవాసులు అంటున్నారు. మండలం కర్ణాటక సరిహద్దున ఉంది. ఇక్కడకు పోస్టింగ్ అంటే ఉద్యోగులు రావడంలేదు. ఇక్కడే సమస్య మొదలవుతోంది. చేసేదిలేక అధికారులు పరిసర ప్రాంతాల ఉద్యోగులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే లబ్ధిదారులు మాత్రం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అందుబాటులో ఉండకపోవడడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. సమస్యల పరిష్కారం కావడంలేదని, ఉన్నతాధికారులు చొరవ చూపి రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరుతున్నారు.

- అగళి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాలి. అయితే ఒక వైద్యుడితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా 38 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా 30 మంది మాత్రమే ఉన్నారు. ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీలను పూర్తిచేసి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. మధూడిలో పశువైద్యాధికారి లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిందిస్థాయి ఉద్యోగులే దిక్కయ్యారు.
- తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ దిక్కయ్యారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యల పరిష్కారానికి చాలా సమయం పడుతోందని, అధికారి అందుబాటులో ఉండటంలేదని అంటున్నారు. అదేవిధంగా కోడిపల్లి వీఆర్‌ఓ పోస్టు ఖాళీగా ఉంది.
- ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ లేరు. ఇన్‌చార్జిలతో నడుస్తోంది.
- అగళి ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు అటెండర్లు, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల ఇంజనీర్, ఇరిగేషన్ ఇంజనీర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ లేరు.
- విద్యుత్‌శాఖ కార్యాలయంలో కొన్నేళ్లుగా ఎలక్ట్రికల్ ఏఈ, ఇద్దరు లైన్‌మెన్ ఇలా అన్ని శాఖల్లోనూ పోస్టులను పూర్తిచేయకపోవడంతో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఘనంగా తొలి ఏకాదశి



దాల్వాటంలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



మడకశిరలో అలంకరణలో వేంకటరమణుడు



పెనుకొండలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

హిందూపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారిని విఠల పాండురంగస్వామి అలంకరణ చేశారు. భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు జరిపారు. భక్తులు విష్ణుసహస్రపారాయణ నామకీర్తనలు చేశారు. కర్నాటక సరిహద్దులో దాల్వాటంలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు కర్నాటక, ఆంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని నాగలూరు పంచాయతీ బండపల్లి గ్రామంలో ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి జ్యోతులను సమర్పించారు.

మడకశిర టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని వివిధ దేవాలయాల్లో ఆదివారం పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి ఉదయం నుంచి అర్చనలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా షిరిడీసాయినాథుని ఆలయంలో సంపూర్ణ శ్రీమద్ భాగవత పారాయణం నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలను అర్చకులు చేశారు.

నరసింహస్వామికి జ్యోతులు..

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని కదిరేపల్లి లక్ష్మీనరసింహస్వామికి మహిళలు జ్యోతులు సమర్పించారు. అనంతరం రైతులు ఎడ్లబండ్లతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, ఎస్ఐ రమేష్ స్వామివారిని దర్శించి పూజలు, అభిషేకాలు చేశారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏకాదశి సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటినుంచి మహిళలు జ్యోతులతో రామస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలచుట్టూ ప్రదక్షిణలు చేశారు. లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మూడురోజులపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. సోమవారం రైతులు ఎద్దుల బండ్ల ప్రదర్శన, మంగళవారం ఉట్లపరుష నిర్వహించనున్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పండగను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని అతిప్రాచీనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం చెరువు రోడ్డులోని దర్గా ఆంజనేయస్వామి ఆలయం, దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు, ఎస్‌రాయాపురం గుడిబండ తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా ఏకాదశి పండగను నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా కొంకల్లు, కురుబరపల్లి ఇతర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్నేశ్వరస్వామి విగ్రహాలకు ప్రత్యే పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

రొద్దం(ఆంధ్రజ్యోతి): నారనాగేపల్లి గ్రామంలో వీరజిన్నయ్యస్వామి పరుషను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని ఎద్దులబండ్లతో ఊరేగింపు చేపట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మనోహర్, నాగభూషణం, లింగప్ప, ధనుంజయ, గోవిందు, గ్రామస్థులు శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పావగడ(ఆంధ్రజ్యోతి): జోడుకంబాల నరసింహస్వామి ఆలయంలో నేడు తొలి ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి.



బండపల్లిలో జ్యోతులు సమర్పిస్తున్న మహిళలు

రోడ్డుపై మురుగునీరు

పట్టించుకోని అధికారులు



రొద్దం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిమేకలపల్లి గ్రామ నడిబొడ్డున సిమెంటు రోడ్డుపై మురుగునీరు ఉన్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి ట్యాంకువద్ద రోడ్డుపై మురుగునీరు నిలిచి పాచిపట్టి దుర్వాసన వస్తోందని, అటుగా వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. ఎన్నోమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలితే ఎవరిది జవాబుదారీ అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు తొలగించి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధుడి శవం లభ్యం

గోరంట్ల, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెల గ్రామం ఈశ్వర్‌రెడ్డి పొలం సమీపంలోని నీటి కుంటలో వృద్ధుడి శవం లభ్యమైంది. వీఆర్‌ఓ ప్రవీణ్ ఫిర్యాదు మేరకు సీఐ శేఖర్ ఆదివారం సంఘటనా స్థలానికెళ్లి వెళ్లి పరిశీలించారు. కాషాయం పంచ, కాకీ రంగు చొక్కా ధరించిన 50 నుంచి 60 యేళ్ల మధ్య వయస్సు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి కుడిచేతిపై ముగ్గు పచ్చ బొట్టు ఉందని తెలిపారు.

హిందూపురంలో...

హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం రేకుల షెడ్డుకింద గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. సుమారు 65-70ఏళ్ల వయసున్న వృద్ధుడు ఆదివారం సాయంత్రం 1వ నంబరు ప్లాట్‌ఫాం షెడ్డు కింద కూర్చుని ఉండి అలాగే మృతిచెందాడు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే 9440627641కు సంప్రదించాలన్నారు. అయితే మృతుడు మైనార్టీ వర్గానికి చెందినవాడుగా పోలీసులు గుర్తించారు.

బెంగళూరులో రామనపల్లి వాసి మృతి

అగళి, జూలై6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామనపల్లి గ్రామానికి చెందిన జగదీశ్(35) బెంగళూరులో ఆదివారం మృతిచెందారు. ఐదేళ్లక్రితం జీవనోపాధి కోసం జగదీశ్ బెంగళూరు వెళ్లాడు. అక్కడే జీవనం సాగించేవాడు. ఆదివారం మృతిచెందాడు. మృతికిగలకారణాలు తెలియరాలేదు.

ఘనంగా ఏకలవ్య జయంతి

గోరంట్ల, జూలై6(ఆంధ్రజ్యోతి): ఎరుకల ప్రజాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఆదివారం నిర్వహించారు. ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు దేవరకొండ ఉమాశంకర్ ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాకే వెంకటారముడు, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, నరసింహప్ప, శ్రీనివాసులు, నారాయణస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరగమవాండ్లపల్లికి చెందిన యువకుడు భానుప్రకాష్ విషద్రావకం తాగి శనివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో భానుప్రకాష్ మనస్థాపానికి గురై విషద్రావకం తాగాడు. కుటుంబీకులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లారు.

రెండు రోజులపాటు గురుపౌర్ణమి వేడుకలు



భిక్షాటన నిర్వహించిన సాయిభక్తులు

మడకశిర టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని షిరిడీసాయినాథుని ఆలయంలో రెండు రోజులపాటు వేడుకలను ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 9వతేదీన ఉదయం 7 గంటలకు సామూహిక షిరిడీసాయి సత్యవ్రతం, మధ్యాహ్నం బంగారు పల్లికిలో స్వామివారి ఊరేగింపు, భజన. రాత్రి 7 గంటలకు లోకకల్యాణ మహాయజ్ఞం తదితర పూజాకార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. 10వతేదీన ఉదయం 5 గంటలకు కాగడ హారతి, 6.30 గంటలకు మంగళస్నానం, 7.30 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, స్వామి వారికి పుష్పాభిషేకం, 12 గంటలకు అన్నసంతర్పణం ఉంటాయని, సాయంత్రం 6 గంటలకు ధూప హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొనాలని కోరింది. ఆదివారం పట్టణంలో భిక్షాటన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లేపాక్షి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

లేపాక్షి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు జేవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఈ ఆలయాన్ని మూడోసారి సందర్శించడం జరిగిందన్నారు. భారతదేశంలోని అద్భుతమైన శిల్పకళల్లో లేపాక్షి ఆలయం ఒకటి అని అన్నారు. యునెస్కో గుర్తింపు జాబితాలో లేపాక్షి ఆలయ పేరు ఉందని, అయితే గుర్తింపు రావాలంటే మరింత అభివృద్ధి జరగాలన్నారు. విశ్రాంతిగదుల ఏర్పాటు జరగాలని సూచించారు. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామి ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్మిక హక్కులను కాలరాసేలా చట్టాలు

ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

పెనుకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకురావడం అన్యాయమని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఈనెల 9న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి అంజనేయులు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరుణ్, గజేంద్ర, బావ, కార్మికులు పాల్గొన్నారు. ఆదివారం వారపుసంతలో సీఐటీయూ నాయకులు బాబావలి ఆధ్వర్యంలో 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, వెంకటేశ్, నరసింహ, లక్ష్మీదేవి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ తెచ్చిన తంటా..

- వ్యక్తిపై కత్తితో దాడి

హిందూపురం, జూలై6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన నూర్‌మహ్మద్‌పై అదే ప్రాంతానికి చెందిన రకీబ్ అలియాస్ టోక్రా అనే వ్యక్తి శనివారం రాత్రి కత్తితో దాడిచేశాడు. రకీబ్ సోదరుడికి చెందిన సెల్‌ఫోన్‌ను నూర్‌మహ్మద్ తక్కువ ధరకు కొనుగోలుచేసినట్లు తెలిసింది. దీంతో సెల్‌ఫోన్ వెనక్కు ఇవ్వాలని రకీబ్ అలియాస్ టోక్రా కోరాడు. ఇవ్వకపోవడంతో శనివారం రాత్రి నూర్‌మహ్మద్‌ను సాయినగర్‌లోకి పిలిపించుకుని వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోశాడు. స్థానికులు గుర్తించి వెంటనే నూర్‌మహ్మద్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే నూర్‌మహ్మద్‌కు, రకీబ్‌కు పాత కక్షలు ఉన్నాయని కత్తితో దాడిచేయడానికి అదికూడా కారణమని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి

పెనుకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండగ సందర్భంగా జిల్లాలోనే ప్రసిద్ధిచెందిన బాబయ్యస్వామి దర్గావద్ద బడేదివాన్‌ఖానాలో ఏర్పాటుచేసిన 72పీర్లతోపాటు వివిధ పీర్లచావిడిలలో ఏర్పాటుచేసిన పీర్లకు జలధి ఉత్సవం ఆదివారం నిర్వహించారు. సాయంత్రం బాబయ్య దర్గా కాబోయే పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా ఆధ్వర్యంలో మతపెద్దలు, ముస్లింలు పెద్దఎత్తున పీర్లను దర్గానుంచి చెరువు వరకు తప్పెట్లు కొడుతూ, బాణసంచా పేలుస్తూ తీసుకెళ్లారు. చెరువు వద్ద జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పీర్లను ఆయా చావిళ్ల వద్దకు తీసుకెళ్లి భద్రపరిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): మొహర్రంలో భాగంగా మండలంలోని గుడ్డంపల్లిలో కొలువదీరిన పీర్లకు పూజలు చేశారు. ఆదివారం పీర్లకు అగ్నిగుండం నిర్వహించారు భక్తులు బెల్లం, చక్కెర తదితర వాటిని చదివించారు. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య జలధి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పావడడ(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం బాబయ్యగుడి వీధిలో మొహర్రం జరిపారు. తొమ్మిది రోజులపాటు తళం బాబయ్య, శిర రోడ్డు బాబయ్య, రొప్పం బాబయ్యను ఉంచి ప్రార్థనలు చేసి పీర్లను జలధికి తరలించారు.



పావగడలో పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం